

సింగరేణి కార్మికులకు నేడు
దీపావళి బోనస్

- రూ.400కోట్ల చెల్లింపులు
- 39500మందికి లబ్ధి



గోదావరిఖని, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్(దీపావళి బోనస్) సింగరేణి కార్మికుల ఖాతాల్లో పడనున్నది. శనివారం దీపావళి బోనస్ చెల్లిస్తామని సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పీఎల్ఆర్ బోనస్ చెల్లింపులు జరుగుతున్నాయి. రూ.400కోట్లు సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్‌గా యాజమాన్యం అందజేస్తున్నది. 39500మంది కార్మికులకు ఈ బోనస్ అందనున్నది. ఒక్కొక్క కార్మికుడికి రూ.1,03లక్షలు యాజమాన్యం చెల్లిస్తున్నది. 240 రోజులు పని చేసిన సర్ఫేస్ కార్మికులకు, 190రోజులు పని చేసిన అండర్ గ్రౌండ్ కార్మికులకు మాత్రమే ఈ పీఎల్ఆర్ బోనస్ వర్తించనున్నది. అంతకన్న తక్కువ మస్టర్లు చేసిన వారికి బోనస్ ఉండదు. జేబీసీసీఐ స్టాండరైజేషన్ కమిటీ సెప్టెంబర్ 25న జరిపిన సమావేశంలో నిర్ణయించిన మేరకు ఈ బోనస్ చెల్లిస్తున్నట్టు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. బోనస్‌ను దసరా పండుగ ముందే కోల్ ఇండియాలో కార్మికులకు పంపిణీ చేశారు. దీపావళి పండుగ ముందు సింగరేణిలో పీఎల్ఆర్ బోనస్ కార్మికులకు అందజేస్తారు. అయితే కేవలం రెండు రోజుల ముందే కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ అందించడం పట్ల కొంత అసంతృప్తి కార్మికుల్లో నెలకొన్నది.



మద్యం షాపులకు దరఖాస్తులు
అంతంతే

- దరఖాస్తు చేసుకోవాలని వ్యాపారులకు ఫోన్లు
- గతంలో 2022 దరఖాస్తులు... రూ.40.4కోట్ల ఆదాయం...
- ప్రస్తుతం 73షాపులకు 274దరఖాస్తులే
- నేడు చివరి రోజు..ఎక్సైజ్ అధికారుల్లో టెన్షన్

కోల్‌సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైన్స్ షాపుల ఏర్పాటుకు సంబంధించి ఎక్సైజ్‌శాఖ ఆశించిన మేరకు స్పందన రావడంలేదు. 74షాపులకు శుక్రవారం వరకు కేవలం 274దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. శనివారం దరఖాస్తులు దాఖలు చేసేందుకు చివరి తేది ఉంది. ఆఖరిరోజు దరఖాస్తులపైనే ఎక్సైజ్ శాఖ ఆశలు పెట్టుకున్నది. గతంలో 77షాపులకు 2022దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వానికి కేవలం దరఖాస్తుల రూపంలోనే రూ.40.44కోట్ల ఆదాయం సమకూరింది. కేవలం చివరి రోజే 1329దరఖాస్తులు వచ్చాయి. ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. 2025-27 సంవత్సరాలకుగాను ఈ ఏడాది సెప్టెంబరు 25న నోటిఫికేషన్ జారీ చేశారు. 26 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దసరా తరువాత దరఖాస్తుల ప్రక్రియ ఊపందుకుంటుందని ఎక్సైజ్ అధికారులు భావించారు. కానీ ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎక్సైజ్‌శాఖగెజిట్‌లో వ్యాపారులను ప్రోత్సహించేందుకు సడలించిన నిబంధనల ప్రభావం తీవ్రంగా పడింది. ముఖ్యంగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో లైసెన్స్ వచ్చిన వారు ఎక్కడైనా షాపు పెట్టుకునేలా నిబంధనలు మార్చారు. మున్సి పాలిటీలో ఎక్కడైనా పెట్టుకునే అవకాశం కల్పించగా, రామగుండం నగర పాలకసంస్థ పరిధిలోని 50 డివిజన్లను రెండు సెక్టార్లుగా విభజించారు. ఈ సెక్టార్ల పరిధిలో షాపులు వస్తే ఎక్కడైనా షాపులు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. డిమాండ్ ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని షాపులను క్లబ్ చేశారు. దీంతో డిమాండ్ ఉన్న అడ్డాల్లో షాపులుపెట్టే గుత్తాధిపత్యాన్ని తగ్గించినట్లయ్యింది. దీంతో వ్యాపారులు కొంత వెనక్కి తగ్గుతున్నట్టు తెలుస్తుంది. గతంలో కొన్ని ప్రాంతాల్లో మద్యం షాపులు డ్రాలో దక్కించుకున్న వారు వెంటనే బేరాలు పెట్టి అమ్ముకునే వారు. రూ.5లక్షల రోజువారి అమ్మకాలు ఉన్న షాపులు, బెల్ట్‌షాపులు ఎక్కువగా ఉన్న షాపులు కోటి వరకు డిమాండ్ పలికాయి. ఈ సారి పరిస్థితి కొంత భిన్నంగా ఉంది.

దరఖాస్తులకు నేడే ఆఖరు...

వైన్స్ టెండర్ల దరఖాస్తులకు శనివారమే ఆఖరి రోజు. ఆఖరి రోజు భారీ స్థాయిలో దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ అంచనా వేస్తుంది. మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగే షాపులకు ఎక్కువ ఫోకస్ చేశారు. చివరి సమయం వరకు చూసి తక్కువ దరఖాస్తులు ఉన్న నెంబర్లపై దరఖాస్తులు పెట్టాలనే ఆలోచనలో వ్యాపారులు ఉన్నట్టు తెలుస్తుంది. జిల్లాలోని భూపతిపూర్, ఎలిగేడు, గర్రెపల్లి, అంతర్గాం, కాల్వ శ్రీరాంపూర్, ముత్తారం తదితర ప్రాంతాల్లో షాపులకు ఈ సారి టెండర్లు ఎక్కువగా దాఖలవుతాయని భావిస్తున్నారు. గతంలో ఆఖరి రోజే 1329దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్‌శాఖ పేర్కొంటుంది.

● ఆర్థిక మాంద్యం, గిరాకీలు తగ్గడంతో వెనుకంజ...

మార్కెట్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోవడం, రిజిస్ట్రేషన్లు అంతంత మాత్రంగా ఉండడం, ఇతర వ్యాపారాలు మందకొడిగా ఉండడంతో మార్కెట్‌లో ఆర్థిక లావాదేవీలు తగ్గిపోయాయి. దీని ప్రభావం మద్యం అమ్మ కాలపై సైతం పడింది. గతంలో రోజు వారి రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు ఉన్న కౌంటర్లు రూ.2లక్షల వరకే అమ్ముడుపోతున్నట్టు

(మిగతా 8వ పేజీలో)

డంప్‌యార్డ్ నిర్వహణ అస్తవ్యస్తం

- తనిఖీ చేసిన సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్



డంపు యార్డును పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్

సుల్తానాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని నిర్వహిస్తున్న డంప్‌యార్డులో చెత్త చేరుకుపోయింది. ప్రాసెసింగ్ లేకపోవడంతో హైదరాబాద్‌లోని సీడీఎంఏకు ఫిర్యాదులు రావడంతో శుక్రవారం సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ సంధ్య డంప్‌యార్డును ఆకస్మి కంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌తోపాటు ఉద్యోగులు సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెత్త నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్ తెలిపారు. చెత్తను ప్రాసెసింగ్ చేసేందుకు సాగర్ మోటార్స్ ఏజెన్సీ కాం ట్రాక్టు దక్కించుకుందని వివరించారు. సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి ఆధ్వ ర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీ పరి ధిలోని డంపింగ్ యార్డులను తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారు. సుల్తానాబాద్ డంప్‌యార్డ్‌ను తనిఖీ చేశామన్నారు. కాంట్రాక్టు సంస్థకు 20 రోజుల సమయాన్ని ఇస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశామని వివరించారు.

బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణరావు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పెగడపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కామారెడ్డి సభలో పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ సమక్షంలో ప్రకటించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని, ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికల కోసం రిజర్వేషన్ ప్రకటించిందన్నారు. బీసీ రిజర్వేషన్‌కు ఓర్వలేని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కొందరిని ప్రోత్సహించి కోర్టుకు పంపారన్నారు. రిజర్వేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి తీరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీసీలు శనివారం నిర్వహించ తలపెట్టిన బంద్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు తెలుపుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 8 మంది బీజేపీ ఎంపీలో అక్కడో మాట, ఇక్కడో మాట మాట్లాడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి...

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బలోపేతంలో అందరూ ఏకమై ముందుకు సాగాలని తెలంగాణ బీసీ జేఏసీ ఇచ్చిన బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతును తెలుపుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించి బీసీ కుల గణన చేయాలని ఆదేశించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకుంటున్నారని, బీసీ బంద్ ద్వారా కేంద్రంలో బీజేపీకి కనువిప్పు కలగాలని, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బంద్ పిలుపునిచ్చిందని, బంద్‌లో సకలజనులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

8ఏ గని ప్రమాద మృతులకు నివాళి 8

రేషన్ షాపుల్లో ముక్కిపోతున్న
దొడ్డు బియ్యం

- వెనక్కి తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం
- నష్టం ఎవరు భరించాలని డీలర్ల ఆందోళన



నిల్వ ఉన్న దొడ్డు బియ్యం

ముత్తారం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేపడుతున్నది. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో మిగిలిన దొడ్డు బియ్యాన్ని తిరిగి వెనక్కి తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని పలువురు రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. దీంతో రేషన్ దుకాణాల్లో ఆరు నెలల నుంచి దొడ్డు బియ్యం అలాగే ముక్కిపోతున్నాయి. మండలంలోని 15 రేషన్ షాపులు ఉండగా, సుమారు 150 నుంచి 200 క్వింటాళ్ల వరకు డీలర్ల వద్ద దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. దొడ్డు బియ్యం నిల్వలు నెలల తరబడి పేరుకుపోయి పురుగులు పడి ముక్కిపోతున్నాయి. వర్షాలతో బియ్యం నిల్వలను భద్రపరచటానికి రేషన్ డీలర్ల ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క ఎలుకలు, పందికొక్కులు, లక్క పురుగుల బెడద ఉందని ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల ఇరుకు గదులు ఉండటంతో తాజాగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం, పాతదొడ్డు బియ్యం కలిపి ఒకే చోట వేయాల్సి వస్తోందని, దొడ్డు బియ్యాన్ని త్వరగా వెనక్కి తీసుకోకుంటే పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని వాపోతున్నారు. బియ్యం తరిగిపోతే ఆ నష్టాన్ని ఎవరు భరించాలని రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు.

దొడ్డు బియ్యం నిల్వలు క్లియర్ చేయాలి

- చెలుకల లింగా భవాని, రేషన్ డీలర్, పోతారం



ఆరు నెలలుగా దొడ్డు బియ్యం రేషన్ షాపుల్లోనే ఉంది. బియ్యాన్ని కాపాడేందుకు అష్టకష్టాలు పడుతున్నాం. బియ్యం త్వరగా వెనక్కి తీసుకుపోవాలి. లేకపోతే పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉన్నది. పూర్తిగా దెబ్బతింటే నష్టం ఎవరు భరించాలి. మరోవైపు షాపుల్లో స్థలం లేక తక్కువ బియ్యం తెచ్చుకుంటున్నాం. దీంతో బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతున్నది. అధికారులు స్పందించి దొడ్డు బియ్యం నిల్వలు క్లియర్ చేయాలి.

టీఎస్‌టీపీపీ నిర్మాణ పనుల్లో అక్రమాలు

- రూ.35 కోట్ల బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలపై సీబీఐ కేసు నమోదు
- ఇద్దరు బీహెచ్‌ఈఎల్ అధికారులతోపాటు 9 మందిపై కేసు

జ్యోతినగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) స్టేజ్ 1 నిర్మాణ పనుల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ కేసు నమోదైంది. టీఎస్‌టీపీపీ మొదటి దశలో 800 మెగావాట్ల 2 యూనిట్ల నిర్మాణానికి ప్రతిపాదించింది. బాయిలర్ ఎరక్షన్, కమీషనింగ్‌లో బీహెచ్‌ఈఎల్ అధికారుల అండతో నకిలీ బిల్లులు సృష్టించి 35.03 కోట్ల రూపాయల అదనపు బిల్లులను బ్రిడ్జ్ అండ్ రూఫ్, పవర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీలు పొందాయని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. బిల్లుల గోల్‌మాల్ వ్యవహారంలో రామగుండం సైట్ బీహెచ్‌ఈఎల్ ఏజీఎం సునీల్‌కుమార్ కొడెపె, మేనేజర్ సంజయ్‌కుమార్‌తో సహా 9 మందిపై ఈనెల 14న సీబీఐ కేసు నమోదు చేసింది. టీఎస్‌టీపీపీ ప్లాంటు స్టేజ్ 1 నిర్మాణ కాలమైన 2017-2022 మధ్యలో ఫోర్జరీ, నకిలీ పత్రాలతో 35.03 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు ఆ సంస్థ విజిలెన్స్(నాగ్‌పూర్) అడిషనల్ జీఎం హరీష్ కుమార్ గుప్తా ఈ ఏడాది మార్చిలో సీబీఐకి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన సీబీఐ ఈనెల 14న ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కాంట్రాక్టు అమలులో ఉన్న కాలంలో బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ లిమిటెడ్ పలు బిల్లులను బీహెచ్‌ఈఎల్‌కు సమర్పించింది. బిల్లుల జారీ, మంజూరులో అప్పటి రామగుండం సైట్ బీహెచ్‌ఈఎల్ అధికారి సునీల్‌కుమార్ కొడెపె, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తున్నది. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశముందని భావిస్తున్నారు. బీహెచ్‌ఈఎల్ అధికారి సునీల్ కుమార్ కొద్ది నెలల క్రితం రామగుండం నుంచి బదిలీ అయ్యారు.

వరికి తెగుళ్లు

- కంకినల్లి, దోమ పోటు ఉధృతి
- ఆందోళనలో అన్నదాతలు
- అధిక వర్షాలే కారణమంటున్న వ్యవసాయాధికారులు
- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆవేదన

ఓదెల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా సన్న, దొడ్డు రకం వరి పంటలకు దోమ, కంకినల్లి తెగులు సోకుతోంది. దీని నివారణకు రైతులు మందులు పిచికారి చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి పొలాల్లో రైతులు దర్శనమిస్తున్నారు. వారంలోనే పంటల్లో మార్పు వస్తుందనుకుంటే ఏ మాత్రం ఫలితం ఇవ్వకపోవడంతో విధిలేక రైతులు డ్రోన్లతో పురుగు మందులను కొట్టిస్తున్నారు. తెగులు నివారణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

● వాతావరణ మార్పుల వల్లనే

రోహిణి కార్తెకు ముందు నుంచే కొన్ని గ్రామాల్లో వరినార్లు సిద్ధం చేశారు. అనంతరం సన్న రకాల వరినాట్లు ఓదెల, కనగర్తి, మడక, కొలనూర్, పొత్కపల్లి గ్రామాల్లో విద్యుత్ మోటార్ల బావుల ఆధారంతో నాట్లు పూర్తి చేశారు. అనంతరం వర్షంతో పాటు రోజు చల్లటి వాతావరణం ఏర్పడడం వల్ల వరి పంటల్లో తెగులుతో పాటు నల్లి పురుగు, దోమ దినదినం అధికమైంది. పచ్చపురుగు ఉధృతి తగ్గినప్పటికీ మిగతా పురుగులు, తెగులు ఉధృతి పెరుగుతుంది. గత పంటలో మొగి పురుగు సోకి రైతులను తీవ్రంగా నష్ట పరుచగా ఇప్పుడు సన్న రకం వరిలో కొత్తగా కంకినల్లి పురుగు, సుడిదోమ పంటలో తిష్ట వేసి రైతుల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి.



వరి పంటలో పురుగుల మందు పిచికారి చేస్తున్న రైతు

ఇటీవల కురిసిన భారీ వర్షంతో పాల దశలో ఉన్న వరి పంటలు నేలమట్టమయ్యాయి. మరోవక్క దోమ, నల్లి పురుగు పంటలపై దాడి చేస్తూ రైతులను ఊపిరాడనివ్వడం లేదు.

● సస్యరక్షణ పద్ధతులు పంటకు రక్షణ

సన్న, దొడ్డు రకం వరి పంటల్లో రసాయన మందులు కొట్టకుండానే పంటలను రక్షించుకోవచ్చు. పొట్టదశ 50 శాతం దాటిన తూర్పు నుంచి పడమర వైపు వరిలో పాయలు ఏర్పాటుతో దోమ ఉధృతి, కంకి నల్లి తెగులు ఉధృతిని నివారించవచ్చు. పంటలో నీటి శాతం ఎక్కువ ఉన్న సమయంలో నీరు పెట్టినట్లయితే పంటల్లో దోమ ఉధృతి పెరిగే అవకాశాలున్నాయి. మడికట్లలో తడి ఆరిపోయే దశలో మళ్లీ నీరు పెట్టినట్లయితే వరి నేలవాలకుండా ఉండడమే కాకుండా దోమ నివారణతో దిగుబడి పెరిగే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

● ఎన్ని ఎకరాలల్లో వరికి నష్టం?

మండలంలో మొత్తం 21,500 ఎకరాల్లో సన్న, దొడ్డు రకం వరి పంటలు సాగు చేయగా, ఇందులో 17200 ఎకరాల సన్న రకం, 4300 ఎకరాలు దొడ్డు రకం పంటలు సాగు చేశారు. వాతావరణం మార్పుల వల్ల దాదాపు 12 వేల ఎకరాల్లో ఈ రెండు రకాల వరి పంటలకు నష్టం వాటిల్లింది. ముందస్తుగా వేసిన వరి పంటలు గొలుసు దశ వచ్చిన సమయానికి తీవ్రమైన గాలి,వానతో నేలమట్టమై రైతుల ఆశలను గల్లంతు చేశాయి. కొన్ని గ్రామాలలో పాల దశలోనే నేలవాలి వరద పాలయ్యాయి.

● వరిలో మాని పండు తెగులు

వాతావరణ మార్పులు, అతివృష్టి వల్ల దెబ్బతిన్న వరి పంటలకు రైతులు ఎప్పుడు చూడని తెగులు, పురుగులు సోకాయి. కంకినల్లి, మానిపండు తెగులు, అగ్గి తెగులు, సుడిదోమ, పిండాకూ తెగుల బారిన పడి రైతులు ఆర్థిక నష్టాల పాలవుతున్నారు. మాని పండు తెగులు (వరి గొలుసుకు పసుపు ముద్దలు) తయారై దిగుబడిని దెబ్బతిస్తుంది. కంకి నల్లి పురుగు పంటలోని పాలను పీల్చడంతో పంటలో అధికంగా తాలు శాతం ఏర్పడుతుంది.

లక్షణాలను బట్టి మందును పిచికారి చేయాలి

- భాస్కర్, ఏ.వో, ఓదెల



పంటకు సోకిన తెగులును గుర్తించి సరైన మందును పిచికారి చేయాలి. కంకినల్లి సోకితే స్పైరో మెసిఫిన్, మానిపండు తెగులు (పసుపు ముద్దలు) ఏర్పడితే ప్రొపికోనజోల్, క్లోరి పైరిపాస్, అలాగే కార్బన్డా జిమ్ వారానికి ఒకసారి, రెండు వారాలు దోమకు డైనో టేఫ్యూరాన్ పిచికారి చేస్తే ఫలితం ఉంటుంది. వర్షం, వాతావరణ మార్పుల వల్ల వస్తున్నాయి. విచ్చలవిడిగా పురుగుల మందులు కొట్టి రైతులు ఆర్థిక నష్టాలకు గురికావద్దు.

నాలుగు ఎకరాలకు రూ. 36 వేలు ఖర్చు చేసిన ..

- గొర్ల కుమార్, రైతు, మడక



ఎనిమిది ఎకరాల్లో సన్న, దొడ్డు రకం వరి పంట సాగుచేసిన, పంటలో సుడిదోమ, కంకినల్లి,పిండి తెగులు సోకడంతో ఎకరానికి రూ. 12వేల చొప్పున ఖర్చు చేసి, మూడుసార్లు మందు కొట్టిన. అయినా దోమ పోవడం లేదు. అధికంగా వర్షం, వాతావరణం మార్పుల వల్ల తీవ్రంగా నష్టపోయిన.

ద్విచక్రవాహనం, కారు ఢీ

● యువకుడి మృతి

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టగా ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం శాంతాపూర్‌కు చెందిన బెక్కం సతీష్(35) అనేవ్యక్తి తన ద్విచక్ర వాహనంపై లక్షెట్టిపేట వైపు వెళ్లుతున్నాడు. అదే సమయంలో ఏపీ 25హెచ్ 2255 నంబరు గల కారు ఎదురుగా వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. ఈ సంఘటనలో సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికురాలి మృతి

కరీంనగర్ క్రైం/టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జ్యోతినగర్ పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్ నగర్‌కు చెందిన మున్సిపల్ స్వీపర్ బడుగు రేణుక(57) విధినిర్వహణలో ఉండగా ఉదయం 10గంటల ప్రాంతంలో జ్యోతినగర్ పెట్రోల్ బంక్ నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వేగంగా ఆమెను ఢీకొట్టాడు. దీంతో రేణుక తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన రేణుకను ఆసుపత్రికి తరలించగా 11:40గంటలకు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి తక్షణ సహాయం కింద 20వేల రూపాయల నగదు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో సుమన్, శానిటరీ సూపర్‌వైజర్లు శ్యామ్‌రాజ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య


జ్యోతి (ఫైల్)

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదువుతున్న ఓ యువతి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికిచెందిన బోయిన జ్యోతి(21) డిగ్రీ సెకండియర్ చదువుతోంది. గురువారం రాత్రి జ్యోతి పురుగుల మందుతాగింది. తల్లిదండ్రులు గుర్తించివెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం పదిగంటలకు చికిత్సపొందుతూ మృతిచెందింది. తన కూతురు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడానికి మృతురాలి స్నేహితుడి ప్రేమ వేధింపులే కారణమంటూ తల్లి బోయిని రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణం మృతురాలి కాలేజీ స్నేహితుడా లేక గ్రామానికి చెందిన స్నేహితుడా అనేది దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


జంగరాజు (ఫైల్)

రామగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన జంగరాజు(38) అనే యువకుడు బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజును హుటాహుటిన వరంగల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య జంగ స్రవంతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్స్ అందజేత


బాధితులకు సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 4సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వాటిని యజమానులకు అప్పగించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన కాత రాజకుమార్ ఆరునెలల క్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రికవరీ చేసి ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బాధితుడు రాజకుమార్‌కు అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లయితే సీఐఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.



కారుణ్యంపై కనికరమేది?

● ఉపాధి లేక రోడ్డున పడుతున్న కుటుంబాలు
● ప్రభుత్వ కాలయాపనతో ఆందోళన
● ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి

వేములవాడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగి మరణించినా, మెడికల్ అన్‌ఫిట్ అయిన సందర్భంలో ఇచ్చే కారుణ్య నియా మకాలపై ఎన్నో కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటంబానికి జీవనాధారం కల్పించేందుకు ఆ కుటంబంలో అర్హత గలిగిన ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. కారుణ్య నియామకాలపై కాలయాపన జరుగుతుండటంతో ఉద్యోగి కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని కారుణ్య నియామకాలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

నియామకాలకు ఎవరు అర్హులు :

ప్రభుత్వ ఉద్యోగులు మరణించినా లేక ఆరోగ్య సమస్యలతో ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉండేందుకు కుటుంబంలో అర్హత గల ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి వారసులు, వైద్య కారణాలతో రిటైర్‌మెంట్ తీసుకున్న ఉద్యోగి వారసులు, ఏడేళ్ల పాటు కనిపించకుండా పోయిన ఉద్యోగి వారసులు కారుణ్య నియామకానికి అర్హులు.

కారుణ్య నియామకాల విధి విధానాలు

కారుణ్య నియామకాలు ఎవరికిస్తారన్న అనుమానాలు చాలా మందికి ఉంటాయి. దానికి విధివిధానాలు ఉన్నాయి. ఉద్యోగి భార్య లేదా భర్త, లేదా కుమారుడు, కుమార్తెలు ఉద్యోగానికి అర్హులు అవుతారు. ఉద్యోగి మరణించిన నాటికి 5 సంవత్సరాల ముందు చట్టబద్ధంగా దత్తత తీసుకున్న కుమారుడు లేదా కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి భార్య, భర్త నియామకానికి ఇష్టపడిన సందర్భంలో ఆ కుటుంబంపై ఆధారపడిన వివాహిత కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి అవివాహితుడై మరణించినట్లయితే అతని సోదరుడు, సోదరికి కారుణ్య నియామకం కల్పించవచ్చు.

ఏ పోస్టుల్లో నియమిస్తారు :

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో గానీ అంతకన్న తుక్కువ గానీ కారుణ్య నియామకాలను ఇవ్వవచ్చు. ఆ పోస్టుకు స్కేల్‌కు మించని పోస్టులో గానీ అంతకన్న తక్కువ పోస్టులో గానీ నియమించే వెసులుబాటు ఉంటుంది.

నియామకపు విధానం :

ఉద్యోగి మరణించిన ఏడాదిలోపు అతని కుటుంబ సభ్యులు నియామకం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. ఆయా పోస్టులకు సంబంధించిన సరైన అర్హత కలిగి ఉండాలి. జూనియర్ అసిస్టెంట్ ఐతే తప్పనిసరిగా ఇంటర్మీడియట్ చేసి ఉండాలనే నిబంధన ఉంటుంది. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి పనిచేసిన యూనిట్‌లో నియామకం చేస్తారు. కలెక్టర్ ఇతర డిపార్టుమెంట్‌లకు కేటాయించవచ్చు. ఖాళీలు లేని సందర్భంలో కలెక్టర్ ఒక క్యాలెండర్ సంవత్సరంలో 5 వరకు సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించే అధికారం కలెక్టర్‌కు ఉటుంది.

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు నాలుగో తరగతి ఉద్యోగుల కుటుంబాలకు రూ. 40 వేలు, నాన్ గెజిటెడ్ వారికి రూ. 60 వేలు గెజిటెడ్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.80 వేలు ఏక్స్‌గ్రేషియా చెల్లించవచ్చును.

ప్రభుత్వం కారుణ్య నియామకాలపై దృష్టిసారించాలి



బూర సదానందం, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్..

ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా, కారణాలతో మృతి చెందిన వారు, అనారోగ్యంతో ఉద్యోగానికి దూరమైన వారి కుటుంబ సభ్యులకు జీవో ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి. ఉపాధ్యాయుల సమస్యలపైన ప్రభుత్వం దృష్టిసారించాలి. ఉపాధ్యాయులను కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి..

దిక్కుతోచని స్థితితో కుటుంబాలు



వంగ తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మరణించిన వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఉద్యోగాలు కల్పిస్తే మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునే అవకాశం కల్పించినట్లు ఉంటుంది.

నాన్న మృతి చెంది సంవత్సరం దాటింది..



పూరేల్లి కల్పన, మరణించిన ప్రభుత్వ ఉద్యోగి కూతురు

మా నాన్న పూరేల్లి రవీందర్ వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో హెచ్‌ఎంగా పనిచేశారు. మా నాన్న అకాలమరణం చెంది సంవత్సరం దాటుతుంది. కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఉద్యోగం ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఎంబీఏ పూర్తి చేసి ఉన్నాను.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోతెవాగు పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వన్నారం, మోతె నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి వివిధ గ్రామాలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్‌ఐ కె రాజు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మల్లాపూర్ : మండలంలోని చిట్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని మల్లాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలోని గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలించిన, నిల్వచేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గోదావరినది పరివాహక గ్రామాలతో పాటువాగుల నుంచి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా ఇసుకను తరలించినా, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రసమయి ఫాంహౌస్‌పై దాడికి యత్నం

● వివిధ మండలాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు ● అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత


పగిలిన ఫాం హౌస్ కిటికీ అద్దాలు

బెజ్జంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు చెందిన ఫాంహౌస్‌పై కాంగ్రెస్‌కార్యకర్తలు శుక్రవారం దాడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నంలో ఉద్రిక్తత నెలకొంది. పలువురు కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు ఒకరిపై మరొకరు విమర్శలు, దూషణలు చేసుకున్న ఓఆడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రసమయి వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం అన్నిమండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మండలంలోని గుండారం గ్రామంలోని రసమయి బాలకిషన్‌కుచెందిన ఫాంహౌస్‌ను ముట్టడించేందుకు నియోజకవర్గంలోని బెజ్జంకి, ఇల్లంతకుంట, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌నాయకులు వివిధమార్గాల్లో వచ్చారు. విషయం తెలిసుకున్న పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కొందరు ఫాంహౌస్‌పైకి రాళ్ల విసిరారు. దీంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈక్రమంలో పోలీసులు పలువురి అదుపులోకి తీసుకుని బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిద్దిపేట రూరల్‌సీఐ శ్రీను, ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. కాంగ్రెస్‌నాయకులు రసమయికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే సత్యనారాయణకు.. రసమయి బాలకిషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న నాయకులు, కార్యకర్తల వద్దకు ఎమ్మెల్యే సత్యనారాయణ చేరుకొని వారితో మాట్లాడి మాజీఎమ్మెల్యే రసమయిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు స్థానిక ఎడ్లబండి చౌరస్తాలో రసమయి బాలకిషన్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన


హాజరైన విద్యార్థులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమరవాణా, లైంగిక వేధింపులు, పిల్లలతో భిక్షాటన, కూలీ పనులు చేయించడం, అవయవ దోపిడీ, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన టాస్క్‌ఫోర్ ఎస్సై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరీంనగర్ మానవ అక్రమరవాణా నియంత్రణ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఇన్‌చార్జి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సురేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ ఐటీ టవర్ సమీపంలోని టీజీ ఎంప్లాయిబిలిటీ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో విద్యార్థులకు పైఅంశాలపై వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడి

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. గురువారం సాయంత్రం గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ దొరికిన వారిని కాళ్లు, చేతులు, ఇంటి ఆవరణలో కూర్చున్న వారి వీపులపై తీవ్రంగా కరిచింది. రక్తస్రావమైన బాధితులు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. అయితే ఒకే కుటుంబంలో తల్లీ ఇద్దరు కూతుళ్లు వాకిట్లో కూర్చోగా వారిపై విరుచుకుపడింది. కుక్క బారినుంచి తప్పించుకునేందుకు తల్లీ కూతుళ్లు ప్రయత్నించినా తల్లిని వీపుపై కూతుళ్లను కాళ్లు, చేతులపై కరిచింది. పిచ్చికుక్క బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటి ప్రహరీని ఢీకొట్టిన కంటైనర్

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్శకుర్తిలో కంటైనర్ అదుపు తప్పి ఇంటి ప్రహరీతోపాటు విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడగా అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి భారీ కంటైనర్ విజయవాడ వెళ్తోంది. డ్రైవర్ మద్యం మత్తులో దారి తప్పి గర్శకుర్తి మీదుగా వాహనాన్ని మళ్లించాడు. గర్శకుర్తిలో రోడ్డు పక్కన ప్రహరీ, ఆ పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టాడు. దీంతో గోడకూలి విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరాను నిలిపివేశారు. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసూరి శంకరయ్య(58) కొంతకాలంగా అప్పులతో ఆర్థికంగా బాధపడుతున్నాడు. ఈనెల 16న పనికి వెల్లుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. రెండు రోజులైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు అదృశ్యం అయినట్లు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మంథని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వ్యాపారాల పేరుతో పెట్టుబడి పేరిట పలువురి వద్ద భారీగా అప్పులు తీసుకొని మోసాలకు పాల్పడిన బందం చంద్రశేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడు మంథనికి చెందిన బండారి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి గోదావరిఖని కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. నిందితుడు చంద్రశేఖర్ మంథని చెందిన దాదాపు 25 మంది వద్ద వ్యాపార పెట్టుబడిల పేరిట వడ్డీ ఎక్కువగా ఇస్తానని నమ్మించి దాదాపు 5-6కోట్లు వసూలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. మరికొందరు బాధితులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.6800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6800 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 159మంది రైతులు 1238 క్వింటాళ్లు విడిపత్తి, 31మంది రైతులు 43క్వింటాళ్లు గోనె సంచుల్లో పత్తి విక్రయానికితీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.6800, కనిష్ఠధర రూ.4800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

నిప్పంటుకొని వంట సామగ్రి, దుస్తులు దగ్ధం

ఖైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎం శాంత అనే మహిళ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. శాంత ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇంట్లో నిప్పంటుకుని సామన్లు, దుస్తులు దగ్ధమయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఇంటితాళం పగుల గొట్టి మంటలార్పారు. రామగుండం రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రూ.10వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

రైస్‌మిల్లులో ఇసుక అక్రమ నిల్వ

● గుట్టుగా సాగుతున్న దందా
● పట్టుకున్న సిబ్బందిని నెట్టేసి టిప్పర్లతో సహా పరార్


కోరుట్లలో పట్టుబడ్డ ఇసుక లారీ

కథలాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో కోరుట్లకు వెళ్లేదారిలో ఉన్న రైస్‌మిల్‌లో వడ్లను నిల్వచేయడానికి బదులు ఇసుక డిపోగా మార్చేశారు. కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ దందా కొనసాగుతున్నట్లు రెవెన్యూ అధికారులు పక్కాసమాచారం అందుకుని గురువారం రాత్రి అకస్మికంగా దాడులు చేశారు. ఆ సమయంలో రెండు టిప్పర్లలో ఇసుకను నింపుతుండగా సిబ్బంది పనులను నిలిపివేశారు. ఒక్కసారిగా డ్రైవర్లు సిబ్బందిని నెట్టేసి టిప్పర్లను స్టార్ట్ చేసుకుని కోరుట్ల వైపు పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడ పట్టుకుని ఆర్టీసీడిపో శివారులో నిలిపి వేశారని తెలిసింది. రైస్‌మిల్ యజమాని తక్కళ్లపల్లి శివారులో ఉన్న పెద్దవాగు నుంచి ట్రాక్టర్లతో ప్రతీనిత్యం రైస్‌మిల్లుకు ఇసుకను తరలించి నిల్వ చేస్తున్నాడు. భారీ డంపులు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో టిప్పర్లలో ఆర్మూర్, నిర్మల్ వంటి ప్రాంతాలకు తరలించి అక్రమదారుల్లో సొమ్ము చేసుకుంటున్నాడని అధికారులకు సమాచారం అందింది. ఈక్రమంలో దాడులు చేసి అక్రమ వ్యవహారాన్ని రెవెన్యూ అధికారులు రట్టు చేశారు. కాగా గురువారం రాత్రి నిల్వఉన్న ఇసుకను ట్రాక్టర్ల సహాయంతో మరో చోటుకు రైస్‌మిల్ యజమాని తరలించినట్లు తెలుస్తోంది.

మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం గాలింపు

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్‌తో పాటు జిల్లాలో పలుప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపడుతున్నట్లు డీఎస్పీరఘుచందర్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. బంగారం, నగదు ఇంట్లో ఉంచుకోరాదని బ్యాంకుల్లో పెట్టాలని ప్రజలకు డీఎస్పీ రఘుచందర్ సూచించారు. వేరే గ్రామాలకు తీర్థయాత్రలకు వెళ్లినపుడు పొరుగింటి వాళ్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని డీఎస్పీ చెప్పారు. దొంగతనాలను అరికట్టడానికి గస్తీ ముమ్మరం చేశామన్నారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన టేకు కలప పట్టివేత


పట్టుకున్న టేకు కలప దుంగలు

రుద్రంగి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన టేకు కలపను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. పోలీసులు పట్టుకున్న టేకు కలపను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రాఘవేంద్రరావు కథనంప్రకారం.. రుద్రంగి మండల కేంద్రంలోని గంగారెడ్డి ఇంట్లో అక్రమంగా టేకుకలపను నిల్వచేసి నట్లు విశ్వసనీయ సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 35టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న టేకు కలపను కొలతలు చేపట్టి కలుప విలువ ప్రకటిస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డ వాహనం

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి రాజీవ్‌రహదారిపై అక్రమంగా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సివిల్‌సప్లై అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం గుండ్లపల్లి రాజీవ్ రహదారి వద్ద సివిల్ సప్లయి అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న బొజ్జ రాజును, పికప్ వాహనాన్ని పట్టుకున్న సివిల్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సివిల్‌సప్లై అధికారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్లు చోరీ


డైనింగ్‌హాల్‌లో కనిపించని సీలింగ్ ఫ్యాన్లు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోగల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డైనింగ్‌హాల్ ముందు ఉన్న ఆరు సీలింగ్‌ఫ్యాన్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేశారు. తొమ్మిదవ తరగతిగది ముందు స్టార్ గుర్తువేసి కోడిగుడ్డు, నిమ్మకాయలు, పసుపు, మిర్చి, కుంకుమ, బొగ్గుతో క్షుద్ర పూజలు జరిపారు. ఫిర్యాదు అందుకున్న పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పాఠశాల వద్ద పహారాకోసం ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీ కొట్టిన ఆటో: ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై కారును వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి వీరయ్య కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణబ్యాంకులో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి ఆటోలో వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నం బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న కారును ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న వీరయ్యకు ఎడమ పక్కన భుజానికి తీవ్ర గాయం కాగా, కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని వీరయ్యను 108లో చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


బొడిగె లహరి

సైదాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బొడిగె లహరి ఎస్ జీఎఫ్ అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, ఉపా ధ్యాయుడు హన్మండ్ల భాస్కర్ తెలిపారు. విద్యార్థిని ఈనెల 18నుంచి 20 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిరుమలపూర్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొటుందన్నారు. లహరిని హన్మండ్ల భాస్కర్ అభినందించారు.

తాటిపల్లి గురుకుల విద్యార్థిని..


దర్శిని

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం దర్శిని రాష్ట్రస్థాయి పాఠశాలల వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కొదురుపాకలో జరిగిన అండర్-17 విభాగం పోటీలలో ఎం దర్శిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినిని ఎంఈవో జయసింహరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు..


అక్షిత్


సాయిచరణ్


క్రాంతి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కే అక్షిత్, కే సాయిచరణ్ సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్- 19 వాలీబాల్ పోటీలకు అక్షిత్, సాయిచరణ్ ఎంపిక య్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కనక విజయ రఘునందన్, కళాశాల క్రీడల ప్రతినిధి కనకయ్య, అధ్యాపకులు, సిబ్బంది అక్షిత్, సాయి చరణ్‌ను అభినందించారు.

● **కోనరావుపేట:** కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడి యట్ చదువుతున్న విద్యార్థి సాల్వల క్రాంతి రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైన ట్లు ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరచగా రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని క్రాంతిని అధ్యాపక బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో వెల్గటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నందయ్య, పీడీ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలో భాగంగా ఈ నెల 16న మల్యాలలోని ఎస్ఎస్‌వీ ఆల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెల్గటూరు విద్యార్థులు గజ్జెల శ్రీవిద్య, బోరె జాశ్విత్, బట్టు గ్రీష్మ టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరిచి ఈనెల 22న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్ఎం నందయ్య,పీడీ రాజ్‌కుమార్, టేబుల్ టెన్నిస్ ఆర్గనైజేషన్ కన్వీనర్ రాజమల్లయ్య, అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ శ్రీకాంత్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మలత, కొండాల్ రెడ్డి పాల్గొన్నారు.


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రోత్సాహం కోసం తప్పని ఎదురుచూపులు



- కులాంతర వివాహాలు చేసుకున్న వారికి నిరాశ
- సకాలంలో విడుదల కాని నిధులు
- జగిత్యాల జిల్లాలో 205 జంటల నిరీక్షణ

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ వివాహాలు చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందడంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహక సొమ్ము కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. కులాంతర వివాహాలు చేసుకుంటే ప్రోత్సాహకాలు అందిస్తామన్న ప్రభుత్వం ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదు. షెడ్యూల్ కులానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయి ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఇది వరకు రూ.50 వేలు ఉన్న ఆర్థికసాయాన్ని గత ప్రభుత్వం 2019 నవంబరులో రూ.2.50 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

కానీ ఆదర్శ దంపతులకు సంబంధించిన ప్రోత్సాహకాలకు నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడంలేదు. వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సాయం సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో ఆదర్శ వివాహాలు చేసుకున్న 253 జంటలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో 68 జంటలకే ప్రభుత్వ సాయం అందింది. ఇంకా 205 జంటల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

నిధులు రాగానే అందజేస్తాం
రాజ్‌కుమార్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జగిత్యాల



ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. జిల్లాలో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అర్హులైన జంటలకు అందించి జీవితంలో స్థిరపడేలా కృషి చేస్తున్నాం.



అర్హులు వీరే..

కులాంతర వివాహం చేసుకున్నవారు ఆర్థిక సాయం పొందాలంటే పలు అర్హతలు కలిగి ఉండాలి. దంపతుల్లో ఒకరు తప్పకుండా షెడ్యూల్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందినవారై ఉండాలి. అమ్మాయికి 18 ఏళ్లు కచ్చితంగా నిండి ఉండాలి. వివాహం చట్ట ప్రకారం రిజిస్టర్ అయి ఉండాలి. పెళ్లయిన జంట వార్షిక ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువగా ఉండాలి. మొదటి వివాహానికి మాత్రమే ఈ ప్రోత్సాహకం అందుతుంది. వివాహమైన ఏడాది లోపు జిల్లా షెడ్యూ ల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం అందుతుంది. కాగా జగిత్యాల జిల్లాలో కులాంతర ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులు ప్రభుత్వ సాయం కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా, నిధులు తక్కువగా విడుదల చేయడం వల్ల అర్హులందరికీ అందడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 లక్షలు ఇస్తుండడంతో కులాంతర వివాహం చేసుకున్న కొంత మంది జంటలు కల్యాణలక్ష్మి వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయాలని కులాంతర వివాహాలు చేసుకున్న పలువురు దంపతులు కోరుతున్నారు.

సింగరేణి మెడికల్ కళాశాలకు 16 పీజీ సీట్ల మంజూరు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో 16పీజీ సీట్లను మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసినట్లు సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్-4, ఎంఎస్ అబ్స్ట్రిక్ గైనకాలజిస్ట్-4, ఎంఎస్ ఆర్థోపెడిక్-4, ఎండీ బయో కెమిస్ట్రీ-4 మొత్తం 16 సీట్లను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఏడాది క్రితం సిమ్స్ కళాశాలలో పీజీ సీట్లు మంజూరు చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ప్రిన్సిపాల్ హిమబిందు దరఖాస్తు చేశారు. ఎంబీబీఎస్ 4 సంవత్సరంలో అడుగుపెడుతున్న సిమ్స్ మెడికల్ కళాశాలలో అన్నీ వసతులు ఉండడంతో పీజీ విద్యార్థులకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండడంతో 16సీట్లను మంజూరు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ ఐదు డిపార్ట్‌మెంట్లలో 24సీట్ల కోసం దరఖాస్తు చేయగా జనరల్ సర్జన్, పిడియాట్రిక్ పీజీ సీట్లను పెండింగ్‌లో పెట్టారని, అవి కూడా త్వరలోనే మంజూరవుతాయని చెప్పారు. త్వరలోనే ఈ పీజీ కోర్సులకు కౌన్సెలింగ్ జరుగుతాయని, పీజీ విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్, ఇతర వసతులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన వరద

మళ్లీ తెరుచుకున్న ఎస్సారెస్పీ గేట్లు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు శుక్రవారం స్వల్పంగా పెరిగింది. దీంతో వర ద గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లను తెరిచి 12,500 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్


అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్ వద్ద కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని గోల్డెన్ టెంపుల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శ్రీనగర్‌లో పర్యటించి శ్రీనగర్ సమీపంలోని డచ్చిగాం నేషనల్ పార్క్‌ను సందర్శించారు. సాయంత్రం పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం)ను దర్శించుకున్నారు.

మందుబాబుల హంగామా..

సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రోడ్డుపై బైఠాయింపు..

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి మందు బాబులు హంగామా సృష్టించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండల కేంద్రంలో సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఇద్దరు మందు బాబులు బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. మద్యం సేవిస్తుండగా పోలీసులు వాహనాన్ని తీసుకుని పోయారని ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సుమారు గంట పాటు హంగామా సృష్టించారు. పోలీసులు చేరుకొని పక్కకు తప్పుకోవాలని సూచించినా వినకపోవడంతో బలవంతంగా పక్కకు లాగి వేశారు.


రోడ్డుపై బైఠాయించిన మందు బాబులు

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు..

విధులకు ఆటంకం కలిగించిన అల్లెపు కనకరాజు, అల్లెపు మల్లిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు సహకరించకుండా దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శాతవాహన పరిధిలోని నేటి పరీక్షలు వాయిదా

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో శనివారం నిర్వహించనున్న ఎంఎడ్ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ రెండో సెమిస్టర్, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన ఎంఎడ్, బీఫార్మసీ పరీక్షలు అక్టోబరు 22న ఉంటాయని, ఎల్ఎల్ఎం పరీక్ష అక్టోబరు 29న ఉంటుందని, మిగిలిన పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులూ లేవని వివరించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్బన్ బ్యాంకు ఎన్నికలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలు నవంబరు 1న నిర్వహించనున్నట్లు బ్యాంకు ఎన్నికల అధికారి సీహెచ్. మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బ్రాంచి పరిధిలోని ఓటర్లు నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జగిత్యాల బ్రాంచి ఓటర్లు జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంటుందని వివరించారు.

21న శాతవాహనలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ కోర్సులో 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ తెలిపారు.

ఎంబీఏలో ప్రవేశం పొందని అభ్యర్థులు (ఐసెట్ -2025 అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులు) ఒరిజినల్ సర్టిఫికెట్లు, అవసరమైన రుసుముతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్‌లో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని పేర్కొన్నారు. 12సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటి వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

వేగంగా ఆలయ విస్తరణ పనులు..

● ప్రధాన ఆలయంలో తొలగిస్తున్న పైకప్పు రేకులు ● కొనసాగుతున్న భక్తుల దర్శనాలు



రాజన్న ఆలయంలోని పైకప్పు రేకులను తొలగిస్తున్న సిబ్బంది, కోటి లింగాల వైపు ఉన్న క్యూలైన్‌లో దర్శనానికి వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మొదటి విడతలో రూ. 74 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో రాజన్న ఆలయ ఆవరణలోని కళాభవన్, ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్, ఈవో కార్యాలయ భవనాలను కూల్చివేసి చదును చేశారు. కాగా శుక్రవారం రాజన్న ప్రధాన ఆలయంలో భక్తులకు ఎండ తీవ్రతకు, వర్షానికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసిన పైకప్పు రేకుల షెడ్డును సిబ్బంది తొలగిస్తున్నారు.

ఉత్తర ద్వారా నుంచి ఆలయంలోకి వచ్చేందుకు, బయటకు వెళ్లేందుకు, బ్రేక్ దర్శన్ క్యూలైన్‌ల వైపు పనులు జరుగుతుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రధాన తూర్పు ద్వారం పక్కన క్యూలైన్‌లా నుంచి భక్తులను అనుమతిస్తూ, కోటి లింగాల పక్కన క్యూలైన్‌ల ద్వారా అద్దాల మండపం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతినిస్తున్నారు.

భీమన్న ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ..

రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో భక్తులు భీమన్న ఆలయంలో స్వామి వారి దర్శనానికి మొగ్గు చూపుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భీమేశ్వర ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. భీమన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వందేళ్లు సరిపడేలా రాజన్న ఆలయ నిర్మాణం..

- శృంగేరి పీఠం జగద్గురుకు ఘన స్వాగతం పలకాలి
- వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని వందేళ్లు సరిపడేలా నిర్మాణం చేస్తున్నారని స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 19,20వ తేదీల్లో శృంగేరి పీఠం జగద్గురు విధుశేఖర భారతిస్వామి విచ్చేస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లపై ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిని రూ. 150 కోట్లతో చేపడుతున్నట్లు చెప్పారు. వం దేళ్ల ఆలయానికి సరి పడేలా ఏర్పాట్లను చేస్తున్నట్లు వివరించారు. రాజన్న ఆలయ అభివృద్ధే ఈప్రాంత ప్రజల, భక్తుల కల అన్నారు.

ఆలయ అభివృద్ధిలో అందరు రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈనెల 19, 20వ తేదీన శృంగేరి పీఠం జగద్గురు శ్రీ విధు శేఖర భారతి స్వామి సాయంత్రం 6 గంటలకు వేములవాడ చేరుకుంటారని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, భక్తులు, నాయకులు హాజరవు తున్నారని, అశేష జన సమూహంతో స్వామివారికి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణోత్త ముల కోరిక మేరకు శంకరమఠంలో శ్రీస్వామి వారి అభిషేక కార్యక్రమానికి హాజరువుతారని సూచించారు. పీఠాధిపతి వేములవాడ రాక ముఖ్యమైనదని, 19వ తేదిన సాయంత్రం 6గంటలకు పట్టణంలోని తెలం గాణ చౌక్‌కు అందరూ చేరుకొని స్వాగత కార్య క్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, వైస్‌ఛైర్మన్ కనికరపు రాకేష్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రాజన్న భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు

- రైతులకు ఉచితంగా రాజన్న కోడెల పంపిణీ
- శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):రాజన్నకు కోడెమొక్కు భక్తుల విశ్వాసానికి ప్రతీక అని స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు శుక్రవారం కోడెలను ఉచితంగా పంపిణీ చేశారు. గోశాలలోని కోడెల పరిస్థితిని పరిశీలించారు. కోడెలకు పచ్చిగడ్డి అందిస్తున్నారా.. లేదా.. ఆరా తీశారు. అనంతరం కోడెలకు పచ్చిగడ్డిని అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు నేరుగా కోడె లను పంపిణీ చేయడంతో వారి వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారన్నారు. రైతులు కోడెలను చక్కగా చూసుకుంటూ సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.


రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

అర్హులైన రైతులకు 102 జతల జీవాల పంపిణీ

కలెక్టర్ ఎం. హరిత

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు కలిగి ఆన్‌లైన్‌లో దరఖాస్తున్న చేసుకున్న అర్హులైన రైతులకు 102 జతల జీవాలను పంపిణీ చేశామని కలెక్టర్ ఎం. హరిత అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించి రైతుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వాటిని వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసకున్న పత్రాలను పరిశీలించి కోడెలను అందిస్తున్నామన్నారు. కోడెలు పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఎమ్మార్వో విజయ ప్రకాశ్‌రావు ఉన్నారు.


రైతుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత

రాజన్న సేవలో విప్, కాంగ్రెస్ అబ్జర్వర్


ప్రత్యేక పూజలో పాల్గొన్న విప్ మనె శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ అబ్జర్వర్ వి మనె శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఆలయ చైర్మన్ జోక్యాన్ని మానుకోవాలి


ఆలయ ఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అర్చకులు

ఓదెల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ పెత్తనాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆలయ ఈవో సదయ్యకు అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ ప్రధాన అర్చకుడు దూపం వీరభద్రయ్య, మరో అర్చకుడిపై పాలకవర్గం చైర్మన్ దురుసుగా ప్రవర్తిస్తూ, అవగాహన రహిత్యంగా మాట్లాడడాన్ని ఖండించారు. పాలక మండలి చైర్మన్ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి గాని అర్చకులు చేసే ఆగమ శాస్త్రంలో తలదూర్చవద్దని కోరారు. ఒక పద్ధతి ప్రకారం దేవుడి కైంకర్యాలు నిర్వహణ ఉంటుందన్నారు. ఈ సంఘటనను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తనుగుల రత్నాకర్ శర్మ, పవన్‌కుమార్, భవాని ప్రసాద్, పంచాక్షరయ్య, గంగాధర్, సూర్య వంశి, అభిషేక్, భువనేశ్వర్, నిరంజన్ పాల్గొన్నారు.

విద్యార్థులు సరైన లక్ష్యం నిర్దేశించుకోవాలి


పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యం నిర్ధేశించుకొని పట్టుదలతో ముందుకు సాగాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అక్కపాక సురేష్ అన్నారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేశారు. ఎంఈఓ రాజయ్య, జిల్లా పెట కార్యదర్శి దాసరి రమేష్, పాఠశాల చైర్మన్ సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, సత్యం, శివ, స్వప్న, సతీష్, పాల్గొన్నారు.

పంటలు నమోదు చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూరగాయలు, ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులు సర్వే నెంబర్ ప్రకారం పంట నమోదు చేసుకోవాలని ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి బి.రాము అన్నారు. శుక్రవారం ముత్తారం, హన్మంతునిపేట, రాంపల్లి, చీకురాయి, భోజన్నపేట గ్రామాల్లో సాగు చేస్తున్న కూరగాయలు, పామాయిల్ తోటలను పరిశీలించారు. ఏఈవో వినయ్‌కుమార్ , ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అందుగులపల్లి వద్ద ఆర్‌టీసీ బస్‌లు నిలుపాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అందుగులపల్లి బస్టాప్ వద్ద ఆర్‌టీసీ బస్‌లు ఆపడం లేదని మాజీ ఉప సర్పంచ్ తలారి స్వప్న సాగర్ గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రానికి 5కిలోమీటర్ల దూరంలో ఉందని, నవంబర్‌లో దేవునిపల్లి గ్రామంలో నిర్వహించే జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని వివరించారు. ప్రయివేట్ వాహనాల్లో వెళితే ప్రమాదాలు జరుగుతాయని భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అందుగులపల్లి వద్ద బస్ ఆపేందుకు చర్యలు చేపట్టాలని వినతిలో కోరారు.

పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిజ్ఞ

ఓదెల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత శుక్రవారం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



8ఏ గని ప్రమాద మృతులకు నివాళి


స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): 8ఏ ప్రమాదం జరిగి 22 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మృతుల స్థూపం వద్ద అమరుల కుటుంబీకుల ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరిగింది. పలువురు కార్మికసంఘాల నాయకులు స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమైన కారణంగానే 2003 అక్టోబరు 16 రాత్రి గనిపై కప్పు కూలి 10మంది కార్మికులు మృత్యువాత పడ్డారని, వారిని యాజమాన్యమే బలితీసుకున్నదని యూనియన్ల నాయకులు పేర్కొన్నారు. ఓసీపీ-3 ప్రాజెక్టు అధికారి ఉదయ్ హరిజన్, మేనేజర్ భరత్‌కుమార్, మాదాసు రామ్మూర్తి, అయిలి శ్రీనివాస్, చంద్రయ్య, ప్రకాష్, రవీందర్, శ్యాంసన్, శంకర్‌నాయక్, అక్రమ్, సత్యనారాయణరెడ్డి, కుంట ప్రవీణ్, మొగిలి, యాదగిరి సత్తయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు సజావుగా నిర్వహించేలా కృషి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ బోర్డు సజావుగా నిర్వహించేలా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని యూనియన్ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు నర్సింహారావు, ధర్మపురిలు తెలిపారు. శుక్రవారం ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కొన్ని నెలలుగా బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికుల్లో నిరాశ నెలకొన్నదని, ఈవిషయమై యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ యాజమాన్యంతో మాట్లాడి ఈనెలలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసేలా ఒప్పించినట్టు ఫేర్కొన్నారు. సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు పనులు ప్రారంభించిందని, కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందుతుందని ధర్మపురి తెలిపారు. ఎలాంటి పురోగతి లేని నైనీ బ్లాక్‌లో కాంగ్రెస్ వచ్చాక పనులు వేగవంతం చేసినట్టు, త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభ దశలో ఉన్నట్టు పేర్కొన్నారు. బేస్ వర్క్‌షాప్‌లో కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. గేట్ మీటింగ్‌లో ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, నాయకులు గడ్డం తిరుపతి, జక్కుల దామోదర్‌రావు తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఫ్లైడే, పీహెచ్‌డీలలో పని చేయలేం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాబోయే ఫ్లైడే, పీహెచ్‌డీలలో తాము పని చేయలేమని ఓసీపీ-3 ప్రాజెక్టు అధికారులు శుక్రవారం పీఓకు వినతి పత్రం అందజేశారు. 2022 నుంచి పీఆర్‌పీ విడుదల చేయకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు పేర్కొన్నారు.

నేటి బంద్‌కు అన్ని వర్గాల మద్దతు


ధర్మారం, పెద్దపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

ధర్మారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ బంద్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మెన్ లావుడ్యు రూప్లానాయక్ ఆధ్వర్యంలో మాట్లాడారు. శాసనసభ, మండలిలో అన్ని పార్టీలు మద్దతు తెలిపిన బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెట్టారన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు బొల్లి స్వామి మాట్లాడుతూ తమిళనాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో 70 శాతం రిజర్వేషన్ కొనసాగుతుండగా తెలంగాణలో ఎందుకు 50 శాతం మించకూడదని ప్రశ్నించారు. బీసీ నాయకులు కొత్త నర్సింహులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై అందరూ ఏకతాటిపైకి వచ్చి రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడాలని కోరారు. ఏఎంసీ వైస్ చైర్మెన్ లింగయ్య, పాలకుర్తి మల్లేశం, గంగారెడ్డి, గంధం మల్లయ్య, సాగంటి కొండయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సొదరి మహేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బహుజన జేఏసీ చేపట్టిన బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. శనివారం జరిగే బంద్‌లో బీజేపీ శ్రేణుల పాల్గొనాలన్నారు. కొల్లూరి సంతోష్ కుమార్, చిట్టవేణి సదయ్య యాదవ్, శేఖర్ మాస్టర్, లక్ష్మణ్ యాదవ్, కొలెంగుల మహేందర్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు వ్యాపారులకు సూచించారు. శుక్రవారం కూరగాయల మార్కెట్‌లో బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, తాళ్లపల్లి మనోజ్, కూకట్ల నాగరాజు, కందునూరి కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ సాధనకోసం జరుగుతున్న బంద్‌కు మాలమహానాడు మద్దతు ఉంటుందని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కట్టెకోల మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసపూరిత కుట్రలను తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్ పిలుపునిచ్చారు. ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల కోసమే హడావిడిగా రిజర్వేషన్‌ను డిక్లేర్ చేశారని, బీసీ రిజర్వేషన్‌కు బీజేపీ అడ్డు వేస్తుందని ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంజీవ్, జక్కుల నరహరి, మచ్చ విశ్వాస్, సతీష్, పవన్ కుమార్, రాకేష్, అంజి, శివరాం, రాజ్‌కుమార్, మహేందర్, రాజు, పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీల రాజ్యాధికారం, విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం న్యాయమైన డిమాండ్ నేరవేర్చుకోవటానికి నిర్వహించే బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జేఏసీ ఇచ్చిన బంద్‌ను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి కోరారు. శుక్రవారం వ్యాపారస్తులను మూసి వేయాలని కోరారు. ముత్తయ్య, చంద్రమౌళి, గుజ్జుల రాజిరెడ్డి, రవీందర్ రావు, నూనె కుమార్, గిరి వీరేందర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): బంద్‌కు అన్ని పార్టీలు సహకరిస్తాయని బీసీ జేఏసీ తెలిపింది. శుక్రవారం ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన సమావేశానికి తాడూరి శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. బంద్ విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. జూనియర్ కాలేజ్ నుంచి ఉదయం 8 గంటలకు ద్విచక్ర వాహన ర్యాలీతో వ్యాపార వాణిజ్య సముదాయాలను బంద్ చేస్తూ బీసీల ఉనికి చాటుతామని పేర్కొన్నారు. చేతి ధర్మయ్య, కొలిపాక నర్సయ్య దాసరి ఉష జ్యోతి బీసీ, మనోజ్ గౌడ్, నల్లవెల్లి శంకర్, కందుల సదాశివ్, కట్ట నరేంద్ర చారి, ఉప్పు రాజకుమార్ పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలని గుండవేన స్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. కాసిపేట ఉదయ్, గంగారం, నాంపల్లి శివదాస్, బొప్పు జాషువా, ఉమ్మల రాజేందర్, పోలుదాసరి రాజయ్య, రాజశేఖర్, భూపెల్లి ప్రసాద్, కాంపల్లి మారుతి, రాజయ్య పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): బంద్‌కు బీఆర్‌ఎస్ పూర్తి స్థాయిలో మద్దతు పలుకుందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని వ్యాపార వాణిజ్య వర్గాలు, పాఠశాలలు, కళాశాలలు, దుకాణ సముదాయాలు బంద్ పాటించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తూ 42 శాతం రిజర్వేషన్ రాజ్యాంగ బద్ధంగా సాధించాల్సింది పోయి కేవలం జీవోలు ఇచ్చి ప్రజలను మాయ చేస్తున్నారన్నారు. ఉప్పు రాజ్‌కుమార్, సయ్యద్ ముబీన్‌ఉద్దీన్, పెంచాల శ్రీధర్, ముఖీమ్, బొడ్డుపల్లి రమేష్, ముత్యం లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీసీ జేఏసీకి మద్దతుగా బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావులు పేర్కొన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, వ్యాపార సముదాయాలు బంద్ పాటించాలని కోరారు. పెద్ది సమ్మయ్య, బింగి రాజు, పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తులు అంతంతే..

(5వ పేజీ తరువాయి)

వ్యాపారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మద్యం వ్యాపారంలో పలువురు నష్టాలు చవి చూసినట్టు తెలుస్తుంది. సేల్స్ తగ్గడంతో ఇక్కడి నుంచి మూడు షాపులను రంగారెడ్డి జిల్లాకు బదలాయించారు. ఇప్పటి వరకు ఈ రంగంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న కొందరు ప్రతి ఏడు ఇతర భాగస్వాములను కలుపుకోవడం, నష్టాలు చూపడంతో ఇతరులు ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలున్నాయి.

పెద్దపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాన్ని పెద్దపల్లిలో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో రూ.10 లక్షలతో చేపట్టే జీపీ పైపులైన్ నిర్మాణం, పెగడపల్లిలో పెద్దమ్మ తల్లి ఆలయానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. రాయపేట ఎత్తిపోతల పథకం ద్వారా పెగడపల్లి చెరువులో హుస్సేనిమియా వాగు నీరు నింపేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోపగాని సారయ్య గౌడ్, లంక సదయ్య, తిరుపతిరెడ్డి, గాజనవేన సదయ్య, ఆరెల్లి రమేష్, దేవేందర్ రావు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక

రామగిరి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలోని రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో శుక్రవారం ఫుట్‌బాల్ ఎంపికకు అనూహ్య స్పందన లభించింది. అండర్ 14-17 బాలబాలికల ఎంపికకు పెద్దసంఖ్యలో హాజరైనట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్ తెలిపారు. పీఈటీలు శ్రీనివాస్, శోభ రాణి, సోమశేఖర్, నక్క శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు దీపావళి వేడుకలు



సుల్తానాబాద్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): చీకటిని నిర్మూలించి వెలుగులను నింపి విజయాన్ని అందించే పండుగ దీపావళి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే లక్ష్మీదేవి పూజతో దీపావళి విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సల్ పాఠశాలలో...



పాలకుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని యూనివర్సల్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు మట్టి, పిండి, మైనం ప్రమిదలు తయారు చేసి లక్ష్మీదేవిని పూలతో అలంకరించి రంగవల్లులు తీర్చి వాటిలో ప్రమిదలు పెట్టి వెలిగించారు. అనంతరం బాణాసంచా పేల్చారు. కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రినిటి ప్రాథమిక పాఠశాలలో



పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ట్రినిటి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్, అకాడమిక్ డైరెక్టర్ మమతలు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి దీపావళి సంబరాలు జరుపుకున్నారు. పర్యావరణ రహిత బాణాసంచా పేల్చి ప్రకృతిని రక్షించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

విత్తనోత్పత్తి క్షేత్రాల పరిశీలన

పాలకుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూర్, జయ్యారం గ్రామాల్లోని విత్తనోత్పత్తి క్షేత్రాలను సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శరత్ చంద్ర వ్యవసాయ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన వరి రకాల (కెఎన్ఎమ్ 1638,కెఎన్ఎమ్ 118,కెఎన్ఎమ్ 12510),పెసర (యంజిజి 295)విత్తనాలను ప్రతి రెవెన్యూ గ్రామానికి ఇద్దరు అభ్యుదయ రైతులకు ఉచితంగా పంపిణీ చేశారన్నారు. మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్,ఏఈవో ఎం యోజన, రైతులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సీజే పై దాడి హేయమైన చర్య


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పిఎస్ నాయకులు

ఓదెల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని వీహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ఐరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దాడిని నిరసిస్తూ శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. చీఫ్ జస్టిస్‌పై అనాగరిక చర్యకు పాల్పడిన హైకోర్టు అడ్వకేట్‌పై కఠిన చర్యతో పాటు, దీని వెనుకనున్న మతోన్మాదులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నారాయణరెడ్డి, పల్లె సుమన్, మాట్ల రాజేశం, శనిగరపు కుమార్, రాచర్ల ఓదెలు, శ్రావణ్, తోట ఉమామహేశ్వరి, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు జడ్జిపై దాడి రాజ్యాంగానికి మచ్చ అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. పలు దళిత, విద్యార్థి సంఘాలతో కలిసి తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. రాకేష్ కిషోర్ అనే న్యాయవాది బూటు విసిరి దాడికి పాల్పడటం అవమానకరమన్నారు. రాజేశం, ధర్మయ్య, శిరీష, కావ్య, సంధ్య, కుమారస్వామి, మహేష్, రాజ్ కుమార్, లత, మౌనిక, సాగర్, మల్లిక్, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కలువల రాజయ్య, తిరుపతి, సతీష్, సుదాకర్, అగ్గిమల్ల కొమురయ్యలు ఉన్నారు.

19న సింగరేణి స్టేడియంలో దీపావళి ఉత్సవాలు

కోల్‌సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి స్టేడియంలో ఈ నెల 19న సాయంత్రం దీపావళి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాలు వర్షాలతో వాయిదా పడగా దీపావళికి నిర్వహిస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి, ఎన్‌టీపీసీ యాజమాన్యాలు, మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాట్లలో పాలు పంచుకుంటున్నాయి. ఉత్సవాల సందర్భంగా ప్రముఖ సినీస్టార్లు సందడి చేయనున్నారు. హాస్య నటులు అలీ, శివారెడ్డి, గాయని గీతమాధురి, జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్‌టీమ్, గోవింద్ టీమ్ డ్యాన్సులు, ఇతర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రావణ దహనం, ఫైర్‌షో, ఫుడ్ స్టాల్స్, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. గత ఏడాది 2లక్షలకుపైగా జనం వచ్చారని అంచనా. స్థలం సరిపోక పరిసరాల్లోని నివాసాలు, రహదారులపై జనం కిక్కిరిపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సారి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం డీసీపీ కరుణాకర్, ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ బందోబస్తు ఏర్పాట్ల గురించి పరిశీలన జరిపారు. సింగరేణి ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రజల పక్షాన హెచ్‌ఆర్సీఐ పోరాటం

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల కోసం పోరాటం చేసేందుకే హెచ్‌ఆర్సీఐ స్థాపించినట్లు జాతీయ అవార్డు గ్రహీత, హెచ్‌ఆర్‌సిఐ జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్‌కుమార్ పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా వార్షికోత్సవ సందర్భంగా జిల్లా తరఫున పలువురికి అవార్డులు అందాయన్నారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్సీఐ వ్యవస్థాపకులు జాతీయ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ సైన్యంలో పని చేశారని, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంస్థను స్థాపించారని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సుమారు 8 వేల మంది సభ్యులతో సంస్థ నడుస్తుందని తెలిపారు. కైలాసం, ప్రసాద్, శ్రీనివాస్, లింగమూర్తి, జాగటి శాంతమ్మ, ఆరే లక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో శ్రీవాణి విద్యాసంస్థల డైరెక్టర్ శశాంక్

సుల్తానాబాద్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని, అందులో శ్రీవాణి జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు సత్తా చాటినట్లు శ్రీవాణి విద్యాసంస్థల డైరెక్టర్ శశాంక తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులను అభినందిస్తూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కబడ్డీ బాలుర విభాగంలో మొదటి స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపిక కాగా, అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల రన్నింగ్‌లో పానేటి శాంతి కుమార్ ప్రథమ, మహేష్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. బాలికల వంద మీటర్ల రన్నింగ్‌లో పెండెం అభినయశ్రీ ప్రథమ, నిట్టూరి అంకిత ద్వితీయ, షాట్ పుట్‌లో మహేష్ ప్రథమ, పానేటి శాంతి కుమార్ ద్వితీయ స్థానం సాధించారు. చెస్ పోటీల్లో ఉప్పం శివప్రసాద్, అలియా ద్వితీయ స్థానం పొందారు. వీరంతా జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా పీడీ సతీష్‌ను కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అభినందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలు, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వాణిశ్రీ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసుసిటేషన్) పై అందరికి అవగాహన ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డా. ప్రశాంత్ సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. అనంతరం పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. డా. వాణిశ్రీ మాట్లాడుతూ, గుండెపోటు వంటి ఆరోగ్య సమస్యలు నివారించాలంటే జీవనశైలిలో మార్పులు తీసుకురావాలని, నిత్యం వ్యాయామం చేయాలని, తక్కువ కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవాలని, ఉప్పు వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఆకస్మికంగా కుప్ప కూలితే 108కు సమాచారం ఇచ్చి, సీపీఆర్ చేయడం ద్వారా కాపాడవచ్చన్నారు. ప్రోగ్రాం అధికారి డా. ఆర్.రాజమౌళి, డా. కె.వి. సుదాకర్ రెడ్డి, డా. బి. కిరణ్ కుమార్, డా. నిస్సీ క్రిస్టినా, డా.మమత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ విధానంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని 108 అంబులెన్స్ కోఆర్డినేటర్ దాసరపు సంపత్ అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు, అధ్యాపకులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. శ్రీవాణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునరుద్ధరణ మహోత్సవం


ఆలయంలో సంతోష్‌రావు-అర్చన దంపతుల పూజలు

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఐబీకాలనీలోని విఘ్నేశ్వర-భక్తాంజనేయ ఆలయ పునరుద్ధరణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, గ్రామదేవతల పూజ, శతఘటాభిషేకం, వాస్తుపూజ, సుందరకాండ పారాయణ వంటి కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగాయి. 26 ఏళ్ల క్రితం స్థాపించిన భక్తాంజనేయస్వామి ఆలయాన్ని అంబటి సంతోష్ రావు-అర్చన దంపతులు సొంత ఖర్చులతో పునరుద్ధరణ చేస్తున్నారు. మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, సోమారపు లావణ్య-అరుణ్, కౌశిక లత-హరి, వోల్లాల సునీల-సురేష్, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరశర్మ, శివశర్మ, కాలనీవాసులు పీచర శ్రీనివాస్, డాక్టర్ జగన్‌మోహన్ రావు, గంట రవి, కొట్టె నరేష్, గంప శ్రీను, పాల్గొన్నారు.

కృష్ణవేణి స్కూల్‌లో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్


విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకిస్తున్న అతిథులు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి హైస్కూల్‌లో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్(ఎస్‌ఎల్‌సీ) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల చైర్‌పర్సన్, కరస్పాండెంట్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి, లీడ్ ఏఈఎం ఐశ్వర్య హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తుందన్నారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం గొప్ప అవకాశమని, పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్, టెక్నాలజీ, ఆర్ట్స్, భాషా ప్రాజెక్టుల ప్రదర్శన ఆకట్టుకుంటుందన్నారు. ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.